29

# లలాట లిఖితం

ఒక ఊరిలో 'రంగరాజు' అనే శ్రీమంతుడు ఉండేవాడు.

ఆయన ఉత్తముడు. నలుగురికీ సహాయం చేసే వ్యక్తి. ఒకరోజున ఆయన వీధి వసారాలో కూర్చుని విశ్రాంతి తీసుకుంటుండగా ఒక సాధువు వచ్చాడు.

ఆ సమయానికి ఇంట్లో ఎవరూ దగ్గరగా లేకపోవడంతో ఆయనే లోపలకి వెళ్లి పళ్ళెంలో బియ్యం పోసి తీసుకు వచ్చాడు. ఆ బియ్యాన్ని సాధువు జోలెలో వేస్తుండగా... అతను రంగరాజు నుదుటి వంక తేరిపార జూసాడు.

కొంచెంసేపు అలా చూసి, "నీకు సర్పగండం ఉంది. వచ్చే సోమవారం నీకు మరణం తప్పదు. దైవ ధ్యానం చేసుకో... పుణ్య లోకాలు ప్రాప్తిస్తాయి!" అని అన్నాడు.

ఆ మాటలు విని ముందుగా విస్తుపోయాడు రంగరాజు.

తర్వాత తేరుకుని 'ఈ సాధువు డబ్బు పిండే ఉద్దేశంతో అలా అని ఉంటాడు' అని అనుకున్నాడు. 'ఇలా భయపెడ్తే వెంటపడి పరిహారం కోసం అడుగుతాం. అప్పుడు ఆ శాంతులూ.., ఈ వ్రతాలూ... అంటూ బాగా గుంజవచ్చు- అన్న దురాలోచనతో అని ఉంటాడు' అనుకున్నాడు. ఆ సాధువు మాటల మీద అతనికి ఏ మాత్రమూ నమ్మకం కలగలేదు.

ఇంతలో... రంగరాజు భార్య జానకీ దేవి బయటకు వచ్చింది.

రంగరాజు నవ్వుతూ సాధువు అన్న మాటలు చెప్పాడు.

ఆ మాట వినగానే జానకీదేవి గుండెలు గుభిల్లుమన్నాయి.

"అడక్కుండానే సాధువు తనంతట తాను చెప్పాడంటే... అందులో ఏదో విశేషం ఉండి తీరుతుంది. మనం దీనిని తేలిగ్గా కొట్టి పారేయడానికి వీలు లేదు. వెంటనే దీనికి పరిహారం ఏమిటో కనుక్కోండి!" అంటూ భర్తని తొందర పెట్టింది.



రంగరాజుకి నవ్వు ఆగలేదు.

"పిచ్చిదానా... అర్థంలేని ఆ పిచ్చి మాటలు నమ్ముతావేమిటి? ఇదంతా వాడి యెత్తు! భయపడి మనం వాడిని వెతుక్కుంటూ వెళ్తామనీ.., అప్పుడు అవీ ఇవీ చెప్పి బాగా డబ్బు పిండవచ్చనీ వాడి ఉద్దేశం. నువ్వు అనవసరంగా దిగులుపడకు!" అని కొట్టిపారేశాడు రంగరాజు.

"కాదండీ... నా మాట వినండీ! వెళ్లి అడగండి. మీరన్నట్టు వాడు డబ్బు గుంజడానికి ప్రయత్నం చేస్తే తిరిగి వచ్చేయండి. నిజమైన సాధువైతే డబ్బు అడగడు. నాకు ఎందుకో- అతను నిజమైన సాధువే... అనిపిస్తోంది. తొందరగా వెళ్లండి" అంటూ ప్రాధేయ పడసాగింది.

రంగరాజుకి ప్రాణం విసిగి, "ఇప్పుడు నేను ఎక్కడని వెతికి వాణ్ని పట్టుకోనే? ఈపాటికి ఎంతో దూరం పోయింటాడు. వాడిని వెతకడం నా వల్ల కాదు" అన్నాడు.

"అయితే... ఓ పని చేయండి. ఈ ఊళ్ళో అగ్రహారంలో రామశర్మగారు ఉన్నారు కదా... ఆయన జ్యోతిషం ఎపుడూ సరిగ్గా అవుతుందని అంటారు. 'జరిగేవి తారీఖులతో సహా చెప్తాడు' అని అందరూ అనుకుంటుంటారు. కనీసం ఆయననైనా ఒక్కసారి సలహా అడగండి. ఆయన కనక 'ఏం ఫరవాలేదు' అంటే - మనం నిర్భయంగా ఉండవచ్చు!" అంది ఆవిడ.

భార్య పోరు పడలేక రామశర్మగారి దగ్గరకు వెళ్లాడు రంగరాజు.

ఆ సమయానికి ఆయన భోజనం పూర్తిచేసుకుని, ఇంటి ముందున్న వేపచెట్టు క్రింద చప్టా మీద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఎప్పుడూ రాని రంగరాజు తనింటికి వచ్చేసరికి ఆశ్చర్యపోయి కూర్చున్నవాడు లేచి ఎదురు వెళ్లాడు.

"రండి, రండి! ఎండలో వచ్చారే... కబురంపితే నేనే వచ్చేవాడిని కదా!" అంటూ మర్యాదగా పలకరించాడు.

లోపల నుంచి చాప తెప్పించి చెట్టు క్రింద వేసి ఆయన్ని కూర్చోబెట్టాడు.

"పంతులుగారూ... మీ సలహా కోసం వచ్చాను" అన్నాడు రంగరాజు.

"అయ్యో... ఎంతమాట! చెప్పండి..." అన్నాడు రామశర్మగారు.

"ఈరోజు మా ఇంటికి ఒక సాధువు వచ్చాడు. నా ముఖం వంక తేరిపార చూసి, నాకు సర్పగండం ఉందనీ, వచ్చే సోమవారం నేను మరణిస్తాననీ చెప్పి వెళ్లిపోయాడు. నాకైతే... ఇటువంటి మాటల మీద నమ్మకం లేదు. వాడేదో డబ్బుకోసం అలా అన్నాడనే నేను గట్టిగా నమ్ముతున్నాను. అయితే... నా భార్యకి మాత్రం- చాలా భయం పట్టుకుంది. మిమ్మల్ని అడిగి రమ్మని పంపింది" అంటూ జరిగింది చెప్పాడు రంగరాజు.

"మంచి పని చేశారు. మీకు నమ్మకం లేకపోయినా ఆ ధైర్యం ఇంట్లో అందరికీ ఉండదుగా! పైగా... ఇలా అడగడంలో నష్టంలేదు. విషయం తెలుసుకుంటే మనకీ ధైర్యంగా

ఉంటుంది. ఆ... మీరు పుట్టిన తిథి, సమయం, మాసం, వారం, సంవత్సరం... ఈ వివరాలన్నీ ఇయ్యండి" అన్నాడు శర్మగారు.

ఆ వివరాలు అన్నీ రాసివున్న కాగితాన్ని చేతికి ఇచ్చాడు రంగరాజు.

ఆ కాగితం తీసుకుని, "చూడండి కరణంగారూ! లలాట లిఖితాన్ని ఎవరూ తప్పించ లేరు. చావు గురించి ముందుగానే తెలుసుకున్న పరీక్షత్తు మహారాజు మృత్యువుని తప్పించు కోగలిగాడా? అయితే... జ్యోతిశ్శాస్త్రంవల్ల రానున్నది తెలుసుకోగలిగితే, మనం అన్నిటికీ సిద్ధపడవచ్చు. మీ జాతక చక్రం వేసి నాకు తెలిసినంతవరకు ఫలితం చెప్తాను.నేను చెప్పేది నిజంకాక పోవచ్చు. ఆ తర్వాత మీ అదృష్టం. భగత్సంకల్పం ఎలా వుంటే అలా జరుగుతుంది" అన్నాడు.

ఆ తర్వాత రంగరాజుగారి జాతక చక్రం వేశాడు శర్మగారు.

దాని వంక నిశితంగా చూసి, కొంచెంసేపు కళ్ళు మూసుకుని ఏదో ఆలోచించాడు. తర్వాత రంగరాజు ముఖంలోకి సూటిగా చూసి మళ్ళీ కళ్ళు మూసుకుని ఆలోచించాడు.

తర్వాత దీర్ఘంగా నిట్టూరుస్తూ కళ్ళు తెరిచాడు.

"చూడండి రంగరాజుగారూ! దైవ ఘటన ఎలావుంటే అలా జరుగుతుంది. దానిని ఎవరూ తప్పించలేరు. మీ జాతకరీత్యా మీకు సర్పగండం ఉన్నమాట వాస్తవమే! మీకు రేపు సోమవారం మరణ యోగముంది. మరో విశేష మేమిటంటే... మీ చావుకి మీ పిల్లలు కూడా కారకులయ్యేటట్లుగా మీజాతకం చెపుతుంది. నేను ముందే చెప్పినట్లు - నేను చెప్తున్న ఫలితం నిజం కాకపోవచ్చు. తర్వాత నా సలహా ఏమిటంటే... మీరు మృత్యుంజయ జపం చేయండి. దైవం కటాక్షిస్తే మీకు ఈ ఆపద తొలగిపోతుంది. ఏది ఏమైనా... మీ బాధ్యతలు నెరవేర్చి అన్నింటికీ సిద్ధంకండి!" అన్నాడు రామశర్మగారు.

"చూడండి శర్మగారూ... నేను ఇందాకనే చెప్పినట్లు నాకు వీటి మీద నమ్మకం లేదు. మరోటి... మిమ్మల్ని ప్రశ్నిస్తున్నానని అనుకోకండి. లలాట లిఖితం తప్పించడం ఎవరి తరమూ కాదని మీరే అన్నారు కదా! అటువంటప్పుడు- మృత్యుంజయ జపం చేస్తే మాత్రం వచ్చే చావు ఆగుతుందా?" అన్నాడు రంగరాజు.

"మీ ప్రశ్న సరిఅయినదే! ఒక ఉదాహరణ ఇస్తాను. మీరు ఇంట్లోంచి బయలుదేరినప్పుడు ఏమాత్రం మబ్బు లేదనుకోండి. వాన వచ్చే సూచన కూడా ఏమీ లేదు. వట్టి చేతులతోనే బయలుదేరారు. అకస్మాత్తుగా వాన వచ్చింది. మీకు నిలబడే జాగా లేదు. పూర్తిగా తడిసిపోతారు. అదే ఆరోజు రేడియోలో వాన వచ్చే సూచన ఉందన్న ప్రకటన మీరు విని, గొడుగు తీసుకుని వెళ్లారనుకోండి! మీరు కొంచెంగానే తడుస్తారు. ఇందులోని విశేషమేమిటంటే... మీరు గొడుగు తీసుకువెళ్లినా, వెళ్లలేక పోయినా... రావలసిన వాన రానే

వచ్చింది. దానిని మీరు ఆపలేరు. కాకపోతే... ముందుగా తెలుసుకోవడం వల్ల గొడుగు తీసుకు వెళ్లి అంతగా తడిసిపోకుండా జాగ్రత్త పడగలిగారు. జ్యోతిశ్శాస్త్రం రానున్న సంఘటనలను ఆపదు. ఆ సంఘటనల వల్ల కలిగే ఫలితాల తీవ్రతను తగ్గించుకోడానికి అవకాశం కల్పిస్తుంది. అతి అరుదుగా... లలాట లిఖితం కూడా మారగలదు. మార్కండేయుడు మృత్యుంజయ జపం చేసి చిరంజీవి కాలేదా? అందుకే ఆ జపం చేయమన్నాను" అని వివరించారు శర్మగారు.

"అయితే- ఇప్పుడు నన్నేమి చేయమంటారు?" అన్నాడు రంగరాజు.

"చూడండి... మీకా నమ్మకం లేకపోయినా- మీరు జాగ్రత్తగా ఉండడంలో నష్టం లేదు కదా! సోమవారం నాడు ఎక్కడికీ వెళ్లకండి. ఇంటి పట్టునే ఉండండి. ఆఖరికి- పెరట్లోకి కూడా వెళ్లకండి. నేను చెప్పినట్లు మృత్యుంజయ జపం చేసుకుంటూ ఉండండి. ఆ రోజు గడిచిపోతే మనకి దిగులే ఉండదుగా..!" అన్నారు శర్మగారు.

"మా ఇంట్లో దొడ్డి కూడా గచ్చు చేసినదే! చెట్లు కాదు కదా... ఆఖరికి గడ్డిపరకలు కూడాలేవు. ఇంక పాము ఎక్కడి నుంచి వస్తుంది? మీరు చెప్పినట్లు- నాకోసం కాకపోయినా మావాళ్ళ కోసమైనా, ఇల్లు కదలకుండానే ఉంటాను" అన్నాడు రంగరాజు.

"చూడండి - దొడ్లో గడ్డి లేదు కదా... అని అశ్రద్ధ చేయవద్దు. పరీక్షిత్తు ఎన్ని జాగ్రత్తలు పడ్డా పండులో ప్రవేశించి పాము రాలేదా? ఈ మాట మిమ్మల్ని భయపెట్టడానికి నేను అనడం లేదు. మరింత జాగ్రత్తగా ఉండమని చెప్పడానికే చెప్తున్నాను. ఎందుకైనా మంచిది- మీరు కూర్చునేచోట నలుగైదుగురిని కర్రలతో కాపలా ఉంచుకోండి. అనుకోకుండా ఎటు నుంచైనా పాము వస్తే వాళ్ళు వెంటనే చంపేట్లు ఉండాలి" అని మళ్ళీ హెచ్చరించారు శర్మగారు.

"మంచిది. అలాగే చేస్తాను" అంటూ జేబులోంచి డబ్బు తీసి ఇయ్యబోయాడు రంగరాజు.

"చూడండీ... జ్యోతిషం చెప్పేవారెవరూ డబ్బు తీసుకోకూడదు. తీసుకుంటే ఫలితం ఉండదు" అని దానిని నిరాకరించాడు శర్మగారు.

శర్మగారి దగ్గర సెలవు తీసుకుని వెళ్లిపోయాడు రంగరాజు.

సోమవారం వచ్చింది.

ఇంట్లో అందరి ప్రాణాలు బిక్కు బిక్కు మంటున్నాయి. అంతకుముందే ఇల్లూ, దొడ్డీ అంతా బాగా దులిపి, కడిగి, ఎక్కడా ఏ కొంచెం కూడా చెత్త అనేది లేకుండా చేశారు. ఒకవేళ పాము వచ్చినా ఎట్టి పరిస్థితులలోనూ అది తప్పించుకుపోయే అవకాశం లేదు.

రంగరాజుగారు, ఆయన ఇంట్లోని వారూ పెందలకడనే భోజనం చేసి వచ్చారు.

ఆయన ముందు వసారాలో వాలుకుర్చీలో కూర్చున్నారు.

ఆయన చుట్టూ నలుగురైదుగురు బలిష్టులు కర్రలు సిద్ధంగా ఉంచుకుని కూర్చున్నారు. ఆయన భార్య, పిల్లలు- ఆయనకి వెనుకగా వసారాని అనుకున్న గదిలో కూర్చున్నారు.

ఇంట్లో అన్ని తలుపులూ, కిటికీలు, వాళ్ళు కూచున్న చోట వున్న ఒక్క తలుపు తప్ప అన్నీ మూసేశారు. తూములలో గుడ్డలు కుక్కారు. పాము కాదు కదా... ఈగలు కూడా లోపలికి రావడానికి వీలు లేకుండా చేశారు.

పదకొండు గంటలు కావస్తుంది. ఉన్నట్లుండి ఆకాశంలో ఒక గద్ద రంగరాజుగారి యింటివైపు వచ్చింది. దాని కాళ్ళకి ఏదో వ్రేలాడుతుంది. చూస్తుండగానే, రెప్పపాటులో రంగరాజు ఇంటి వసారా ముందు గచ్చు నేలమీద దబ్బున పడింది.

'అది ఏమిటా..?' అని చూస్తూండగానే ఒక పెద్ద తాచుపాము పడగ ఎత్తి బుసలు కొట్టూ చకచకా మెట్లెక్కి, రంగరాజువైపు పాకసాగింది. మరునిమిషంలో ఆ పాము రంగరాజుని సమీపించేదే.., బహుశా... కాటు వేసేదే!

అయితే... ఆయన కాపలా వుంచిన మనుషులు ఈలోగానే విభ్రాంతి నుంచి తేరుకొని ఆ పాముని చంపివేశారు.

అందరూ ఆ సంఘటనకి కొయ్యబారిపోయారు.

ఆ తర్వాత నెమ్మదిగా తేరుకున్నారు. పీడ తొలగిపోయినందుకు హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

ఇంతలో... ఆలయంలో పూజ చేసుకుని రామశర్మ గారు అక్కడికి వచ్చారు. రంగరాజు ఇంట్లోకి అడుగు పెట్టారు.

"పంతులుగారూ... లలాట లిఖితం తప్పదన్నారు మీరు. పామైతే వచ్చింది కానీ.., అది నన్ను చంపలేదు. అదే చచ్చింది" అన్నాడు రంగరాజు.

"దైవ సంకల్పం ఎలా వుందో ఎవరు చెప్పగలరు?" అన్నారు శర్మగారు.

"ఇదంతా మీ పుణ్యం పంతులుగారూ! మీరు చెప్పినట్లు మృత్యుంజయ జపం చేయడం వల్ల ఈ గండం గడిచింది. నా పసుపు-కుంకుమ మీరే నిలబెట్టారు" అంటూ శర్మగారి కాళ్ళ మీద పడింది జానకీ దేవి.

"లే... అమ్మా... లే! అంతా దైవేచ్ఛ..!" అని ఆమెని లేపారు.

అక్కడ చచ్చి పడివున్న పాముని చూస్తూ "అబ్బా... కృష్ణ సర్పం - చాలా పెద్దదే! దీని విషానికి విరుగుడు లేదు" అన్నారు ఆయన.

ఇంతలో... ఆ పాముని చూడడానికి లోపల నుంచి రంగరాజు చిన్నకొడుకూ, కూతురూ బిల బిలా అక్కడికి వచ్చారు.

"నాన్నగారూ... పాముకి విషం ఎక్కడుంటుంది?" అని అడిగింది ఆయన కూతురు.

"దాని నోటిలో కోరలు ఉంటాయి" అన్నాడు రంగరాజు.

"మరి - ఆ కోరల్లోనే విషం ఉంటుందా?" అన్నాడు కొడుకు.

"కాదు. విషం తిత్తి వేరుగా మెడ కింద ఉంటుంది. దాంట్లోంచి కాటు వేసినపుడు విషం కోరల్లోకి వస్తుంది" అని వివరించాడు రంగరాజు.

"ముందు ఆ పాముని బయట పడేసి, అగ్నిసంస్కారం చేయించండి" అన్నారు శర్మగారు.

"ఒక్క క్షణం - పసిపిల్లలు సరదా పడుతున్నారు. దాని కోరలు ఎక్కడున్నాయో చూపిస్తా!" అంటూ కుర్చీ దిగివచ్చి ఆ చచ్చిన పాము మెడ దగ్గర పట్టుకుని పైకి ఎత్తాడు రంగరాజు.

"ఇదిగో... ఇక్కడ కోరలుంటాయి!" అంటూ రెండో చేత్తో దాని నోరు తెరిచాడు.

ఆ తెరవడంలో రంగరాజు వేలు దాని కోరల కిందికి పోవడం, అదే సమయంలో అప్రయత్నంగా ఆయన దాని మెడక్రింద వున్న విషపు తిత్తిని నొక్కడం... క్షణ కాలంలో జరిగిపోయాయి.

అంతే..! కోరలోంచి విషం ఆయన వ్రేలికి దిగింది.

"అబ్బా..." అంటూ కేక వేసి విరుచుకు పడిపోయాడు.

మరుక్షణంలో నోటి నుంచి నురుగులు కక్కుతూ బరువుగా ఊపిరి తీయసాగాడు.

ఆ దిగ్భ్రమ నుండి మిగిలిన వారు కోలుకొనే లోపలే రంగరాజు ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసి పోయాయి.

"ఇందులో ఎవరి ప్రమేయమూ లేదు. అంతా లలాట లిఖితం! లేకుంటే...ఎక్కడి నుంచో పాముని గ్రద్ద ఎత్తుకు వస్తుంటే అది మీ ఇంటిలో పడటం ఏమిటి? అది చచ్చి పీడ పోయిందనుకుంటే.., పిల్లల సరదా తీర్చడం కోసం ఆ పాము నోట్లో వేలు పెట్టడమేమిటి.., ప్రాణం పోగొట్టుకోవడం ఏమిటి? ఆయన జాతకంలో... సర్పగండం, పిల్లల ద్వారా మృత్యువు- స్పష్టంగా ఉన్నాయి. ఆ విషయం ఆయనకి చెప్పాను కూడా! కాని, ఎవరు మాత్రం గీతని మార్చగలరు? పిల్లలూ... మీరు బాధపడకండి. మీరు నిమిత్త మాత్రులు! ఇలా జరగాల్సి ఉంది కనుకనే జరిగింది. లలాట లిఖితాన్ని ఎవరూ తప్పించలేరు" అని ఓదార్చి వెళ్లిపోయారు శర్మగారు.

★★★